క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం పర్యటించనున్నారని కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంతో పాటు.. కొంగరకలాన్‌లో సాయంత్రం నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల కేంద్రానికి చెందిన మహ్మద్ మిస్కిన్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.20 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బాధితుడికి మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లక్పతినాయక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కోసం, భుక్తి కోసం..



నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

కడ్తాల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం మండల అధ్యక్షుడు సిల్వేరు కృష్ణయ్య అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె కీలక భూమిక పోషించారని తెలిపారు. రాష్ట్ర ప్రజల తెగువను, పోరాట పటిమను, స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయురాలని కొనియాడారు. ఆమె ధైర్య సాహసాలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, కరుణాకర్, శేఖర్, బాలరాజు, సందీప్, నర్సింహ, యాదయ్య, వెంకటేశ్, శ్రీరాములు, వీరయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా లక్కీ డ్రా



వెంకటనర్సప్ప, డిపో మేనేజర్

ఇబ్రహీంపట్నం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణికుల కోసం ఆర్టీసీ లక్కీ డ్రా పథకాన్ని ప్రవేశ పెట్టిందని పట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు సెమీ డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఈ స్కీం వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకున్నాక.. తమ టికెట్‌పై పేరు, ఫోన్ నంబర్, చిరునామ రాసి ఆయా బస్‌స్టేషన్లలో అమర్చబడిన బాక్సుల్లో వేయాలని సూచించారు. వచ్చే నెల 8న సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో డ్రా తీసి, విజేతలను ప్రకటిస్తామని చెప్పారు. ప్రతి ప్రాంతం నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.25 వేలు, 15 వేలు, 10 వేలు అందజేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని డీఎం కోరారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ తదితరులు

యాచారం: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్‌ఐ మధు అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నేడు ప్రారంభించే యువ చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆయన శుక్రవారం ఠాణా ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య, నాయకులు జంగయ్య, కుమార్, శివ పాల్గొన్నారు.

వీడని ‘పీఠ’ముడి

పట్టు వీడని నేతలు..

- ఎటూ తేల్చని అధికారులు
- కోర్టు ఉత్తర్వులు బేఖాతరు!
- తేలని బాటసింగారం పంచాయితీ..
- ప్రశ్నార్థకంగా ఎఫ్ఎస్‌సీఎస్ సమీక్ష



బాటసింగారం రైతు సేవా సహకార సంఘం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇద్దరు నేతల మధ్య వైరం ప్రభావం మొత్తం బాటసింగారం రైతుసేవా సహకార సంఘం పరిపాలనపై పడింది. సంఘం చైర్మన్ కుర్చీ నాకే కావాలంటూ ఇరువురు పోటీపడుతూ.. పట్టువీడటం లేదు. దీంతో తొలుత ఆ పంచాయితీ న్యాయస్థానం తలుపుతట్టగా.. అక్కడి నుంచి జిల్లా సహకార శాఖ అధికారి చేతుల్లోకి వెళ్లింది. అదీ ఎటూ తేలకపోవడంతో.. ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే సంఘం సర్వసభ్య సమావేశంపై పడింది. ఏటా సెప్టెంబర్ 30లోపు చేపట్టే సమీక్ష.. ఈసారి సంబంధిత అధికార యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో.. సమావేశం లేనట్లేనని స్పష్టం అవుతోంది.

నియామకం..

చైర్మన్‌గా పనిచేసిన చేగూరి భరత్‌కుమార్.. సంఘం పరిధిలోని కొంతమంది రైతులు రుణాలపై వడ్డీ మాఫీ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, సొంత నిర్ణయాలు తీసుకున్నారని, దీని వలన సంఘానికి నష్టం జరిగిందని ఆరోపిస్తూ.. కొంతమంది మాజీ సర్పంచులు జిల్లా సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ.. ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ ఆగస్టు 14న జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల మేరకు జైపాల్‌రెడ్డి.. మరుసటి రోజు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన జాతీయ జెండా ఎగురవేసి బాధ్యతలు స్వీకరించడం విధితమే.

నిలుపుదల

ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లిని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ.. పూర్వ చైర్మన్ చేగూరి భరత్‌కుమార్.. హైకోర్టును ఆశ్రయించారు. తనను పదవి నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను, జైపాల్‌రెడ్డికి ఇన్‌చార్జిగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీంతో పై రెండు ఉత్తర్వులను రద్దు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సిన జిల్లా సహకార శాఖ అధికారులు.. 45 రోజులు గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ప్రభావం సంఘం అభివృద్ధి, పరిపాలనపై పడే అవకాశం ఉందని సంఘం సభ్యులు పేర్కొంటున్నారు. చైర్మన్ పీఠం చిక్కుముడిని విప్పాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పంచాయితీ ముదిరి పాకాన పడుతోంది.

పక్షం రోజుల ముందే..

సహకార సంఘం సమావేశం నిర్వహించాలంటే సుమారు మూడు వారాల ముందుగానే ఎంసీ మీటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. పక్షం రోజులకు ముందే తగిన తేదీని ప్రకటించాల్సి ఉంటుంది. అయితే సంఘానికి చైర్మన్ లేకపోవడం వలన సమీక్ష గురించి అధికారులు, పాలకవర్గం సభ్యులు (డైరెక్టర్లు) ఎటూ తేల్చలేకపోతున్నారు. సమావేశం ప్రశ్నార్థకంగా మారింది.

అధికారుల అలసత్వం



ప్రభుత్వం జారీ చేసిన జీఓ 386 ప్రకారం నన్ను చైర్మన్‌గా కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు. దీంతో సెప్టెంబర్ 5న మరోసారి కోర్టులో కంటెప్ట్ కేసు వేశాను. దీనికి అధికారులు నాలుగు వారాల గడువు కోరారు. అధికారుల అలసత్వం కారణంగా ఆ ప్రభావం.. సంఘం పరిపాలనపై చూపుతోంది.

– భరత్‌కుమార్

ఆదేశాలు రాలేదు



చైర్మన్ పదవి విషయంతో ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వివాదం నాటి నుంచి జిల్లా అధికారి పర్యవేక్షణలో సంఘం పరిపాలన కొనసాగుతోంది. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం. రైతులకు, సభ్యులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం.

– ఐలేష్ యాదవ్, సంఘం మేనేజర్

వీరవనిత చాకలి ఐలమ్మ



మాడ్గుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- అవురుపల్లిలో ఐలమ్మ విగ్రహావిష్కరణ
- ఘనంగా పోరాట యోధురాలి జయంతి

మాడ్గుల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, వెనుకబడిన వర్గాల్లో సామాజిక చైతన్యం రగిలించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు అచారిలు అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధి అవురుపల్లి గ్రామంలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాట పటిమను తెలంగాణ ప్రజలు మరువలేరన్నారు. ఆమె ఉద్యమ ఫలితంగానే.. నిజాం నిరంకుశ పాలనకు అడ్డుకట్ట పడిందని పేర్కొన్నారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇర్విన్‌లో కూడలిలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి.. రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ అజయ్, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్నంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రవి, స్వామి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

వీడని ముసురు

ఇబ్రహీంపట్నం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా ముసురు పడింది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మండలంలో 22.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. రాత్రి 8 గంటల వరకు పట్నంలో 13.8. మి.మి, దండుమైలారంలో 8.8 మి.మి, మంగల్‌పల్లిలో 15.3 మి.మి, ఎల్మినేడులో 10.3 మి.మి, కొంగరకలాన్‌లో 12.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మధ్యాహ్నం కొంతసేపు విరామం ఇచ్చింది.

సమావేశం వాయిదా వేయాలి

కందుకూరు: కొద్ది రోజులు చైర్మన్‌గా కొనసాగిన వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 29న నిర్వహించే పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలని సంఘం డైరెక్టర్లు కోరారు. శుక్రవారం సీఈఓ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పాత చైర్మన్ చంద్రశేఖర్ కొనసాగుతున్నారని తెలిపారు. చేపట్టనున్న సమీక్షను రద్దుచేసి, డీసీఓ ఆదేశాల అనంతరం సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. డైరెక్టర్లు విజేందర్‌రెడ్డి, ఆనంద్, శేఖర్‌రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి. చిత్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి పల్లెచెలకతండాలో టీజీఐఐసీ నిధులు రూ.1 కోటితో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు రమేశ్‌నాయక్, శ్రీనునాయక్, సీతారాంనాయక్, బాల్దాస్ నాయక్, మాన్య, రవీందర్, నరేందర్, రాజు, పాండు, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

రైతుల జీవితాలతో ఆడుకోవద్దు



దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: నిరుపేద రైతుల వ్యవసాయ పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ వేసి, వారి జీవితాలతో ఆడుకోవద్దని, వెంటనే 765కేవీ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బాధిత రైతులు చేపట్టిన దీక్ష శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. దీక్షకు పలు సంఘాల నాయకులు సంఘీభావంగా మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, పాండు, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మనాయక్, పెంటారెడ్డి, రాజేందర్‌యాదవ్, వెంకట్‌రాములు గౌడ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘనంగా బతుకమ్మ సంబురం

ఆమనగల్లు: బతుకమ్మ సంబురాలు శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అధ్యాపకులతో కలిసి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ మాధవరావ్, అధ్యాపకులు జైపాల్, పర్వతాలు, నాగమణి, వెంకటయ్య, కృష్ణయ్య, విష్ణు, లక్ష్మణ్ణ, రవి, అలివేలు, చంద్రశేఖర్, చైతన్య, సిబ్బంది శేఖర్, విజయ, రాజు, సుశీల, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మండల వైద్యాధికారి అన్నపూర్ణ

మొయినాబాద్: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని.. అందులో భాగంగానే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి అన్నపూర్ణ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ‘ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం’కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు శక్తివంతంగా, బలంగా ఉంటాయన్నారు. అందుకోసం పీహెచ్‌సీలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఈఎన్‌టీ, నేత్ర, బీపీ, షుగర్, దంత పరీక్షలు, కేన్సర్, రక్తహీనత, టీబీ వంటి పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యుడు రమేష్, ఉస్మానియా ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి, ఉస్మానియా జనరల్ సర్జన్ ప్రత్యూష, సీహెచ్‌వీ వెంకట్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మహాలక్ష్మీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



కడ్తాల్: మైసిగండిలో లలిత త్రిపుర సుందరిదేవిగా అన్నపూర్ణేశ్వరి



యాచారం: లలితా త్రిపురసుందరిగా.. జ్ఞాన సరస్వతీ



ఆమనగల్లు: ధనలక్ష్మి అవతారంలో..



ఆమనగల్లులో మహిళల సామూహిక కుంకుమార్చన

అమ్మవారి సన్నిధిలో భక్తజనం సందడి

దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి, లలితా త్రిపుర సుందరిదేవి, ధనలక్ష్మి అలంకరణలో దర్శనం ఇవ్వగా.. భక్తజనులు తన్మయత్వంతో పరవశించిపోయారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గామాతకు నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేషపూజలు నిర్వహించారు.

–సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయస్వామి ఆలయంలో నెలకొల్పిన దుర్గామాత



కడ్తాల్: దుర్గామాత సన్నిధిలో భక్తులు



కడ్తాల్: భక్తులకు అన్నదానం




ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న భక్తజనం

లైబ్రరీ ప్రారంభం

ఆమనగల్లు: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం సివిల్‌కోర్టు జడ్జి కాటం స్వరూప ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది శశికాంత్ సహకారంలో రూ.1.50 లక్షలతో లైబ్రరీని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ ఆమనగల్లు అధ్యక్షుడు యాదీలాల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, న్యాయవాదులు ఆంజనేయులు, జమీల్, అహ్మద్, రామకృష్ణ, గణేశ్, మల్లేశ్, కృష్ణ, శేఖర్, మధు, అశోక్ పాల్గొన్నారు.

నవ వధువు బలన్మరణం



శిరీష(ఫైల్)

కడ్తాల్: నవ వధువు బలన్మరణానికి పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ వివరాలు ఇలా ఉన్నాయి.. సలార్‌పూర్‌కు చెందిన శిరీష (20)కు ఇదే గ్రామానికి చెందిన రాకేశ్‌తో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. కుటుంబ సమస్యల విషయమై గురువారం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన శిరీష ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులు అప్పగించారు. శిరీష తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బడంగ్‌పేట్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దేశం స్వచ్ఛత వైపు అడుగులు వేయాలంటే వ్యక్తిగతంగా అందరూ సహకరించాలని మాజీ మేయర్ చిగురింత పారిజాత కోరారు. కార్పొరేషన్ పరిధి మల్లాపూర్‌లో శుక్రవారం ఆర్‌సీఐ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా–2025 కార్యక్రమం నిర్వహించారు.